క్లుప్తంగా

రేపు మెగా వైద్య శిబిరం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 25న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నరసరావుపేట వరబాబు సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో పరీక్షలు చేసి మందులను ఇవ్వనున్నట్లు తెలిపారు.

వైభవంగా గంధ మహోత్సవం

నాదెండ్ల: అప్పాపురం గ్రామంలో కొలువైయున్న హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 16వ ఉరుసు మహోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం రెండో రోజు గంధ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాదెండ్ల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పోలీసులు శుక్రవారం పరిశీలించారు. ట్రైనీ డీఎస్పీ జగదీష్, నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి, సిబ్బందితో కలసి ముందుగా గణపవరంలోని 15 పోలింగ్ బూత్‌లను, అక్కడి నుంచి నాదెండ్ల, తూబాడు, చందవరం, ఎండుగుంపాలెం, సాతులూరు, చిరుమామిళ్ళ, సంకురాత్రిపాడు, కనపర్రు, బుక్కాపురం కేంద్రాలను పరిశీలించారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఏబీసీ కెనాల్ వద్ద వేంచేసియున్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాసరావు సారథ్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకటరావు, చెరుకూరి హనుమంతరావు, సనిశెట్టి వెంకట గురువీరాంజినేయులు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేపట్టారు.

సిలిండర్ పేలి వృద్ధుడికి గాయాలు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలి గజ్జల లక్ష్మీరెడ్డి వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. లక్ష్మిరెడ్డి ఉదయాన్నే టీ కాచుకునేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించాడు. అప్పటికే గ్యాస్ లీక్ అయి ఉండటంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో లక్ష్మీరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించారు. నరసరావుపేట వైద్యశాలకు తరలించగా ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు.

అనుమానాస్పద మృతిపై దర్యాప్తు

ఈపూరు: మండలంలోని అగ్నిగుండాల సమీపంలో గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బూక్యా తులసి నాయక్ మృతిపై పోలీసులు విచారణ చేపట్టారు. నర్సరావుపేట డీఎస్పీ శర్మ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలోనే కేసును చేధించి నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

చోరీలపై విచారణ ముమ్మరం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం పిట్టబండ, గోనుగుంట్లవారిపాలెం గ్రామాల్లో ఈనెల 21 వతేదీన జరిగిన చోరీలపై పోలీసులు విచారణ చేపట్టారు. సి.ఐ సాంబశివరావు ఆధ్వర్యంలో క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. పిట్టంబండ గ్రామానికి చెందిన మక్కెన గంగాధర్, గోనుగుంట్లవారిపాలెం గారమనికి చెందిన దండు శ్రీనివాసరావు ఇళ్లలో జరిగిన చోరీల్లో ఆధారాలు సేకరించారు.

మృతదేహంతో ఆందోళన

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు మృతదేహంతో రోడ్డుపై కూర్చొని ఆందోళనకు దిగిన సంఘటన శుక్రవారం రాత్రి పల్నాడురోడ్డులోని పెద్దచెరువు బైపాస్ సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పాతూరు చెరువుకట్టకు చెందిన మేడిశెట్టి శివకోటేశ్వరరావు (30) రావిపాడు రోడ్డులో కొబ్బరిబొండాల దుకాణం నిర్వహిస్తుంటాడు. ఈనెల 20వ తేదీన దుకాణం సమీపంలో రోడ్డుదాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. గాయపడిన కోటేశ్వరరావును గుంటూరు జీజీహెచ్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగిన వారికి సీఐలు సంఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేయిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- 6వేల 892 మంది మహిళా సభ్యులకు రూ.5 కోట్ల 51 లక్షల లబ్ధి
- ఉల్లాసంగా ఉత్సాహంగా వైఎస్సార్ ఆసరా వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న మహిళా సభ్యులు

శావల్యాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో మహిళలు అభ్యున్నతికి మొదట ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత రుణమాఫీ కార్యక్రమం ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలో రూ.25 వేల కోట్లు రుణమాఫీ నగదు పారదర్శకంగా జమ అయిందన్నారు. అలాగే చట్టసభల్లో మహిళలకు 50 శాతం ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు దక్కుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో పార్టీలకు కులామతాలకు అతీతంగా అర్హత కల్గిన మహిళ సభ్యురాలందరికీ లబ్ధి పొందారన్నారు. మహనీయుడు ఎన్టీఆర్‌ను కత్తిపోటు కన్నా వెన్నుపోటు పొడిచి తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన దుర్మార్గుడు చంద్రబాబునాయుడు అని, 14 సంవత్సరాలపాటు సీఎంను చేశానంటూ ప్రచారం చేయటం మినహా పేద ప్రజలకు చేసింది ఏమి లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జన్మభూమి కమిటీలు మాదిరిగా లంచం ఇస్తేనే పథకాలు ఇస్తాం అని చెప్పే రోజులు మారాయన్నారు. టీడీపీ పాలనలో పింఛన్లు 39 లక్షల మందికి మంజూరు చేస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో 80 లక్షల మంది లబ్ధిదారులకు మంజూరు చేశారని గుర్తుచేశారు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే సంక్షేమ పథకాలు పారదర్శకంగా ఇప్పటి వరకు రూ.2 లక్షల 55 కోట్లు నగదు పేదలకు నేరుగా లబ్ధిపొందుతున్నాయని పార్లమెంటు సమావేశంలో ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామ్ మాట్లాడటం చాలా గర్వంగా ఉందన్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం 6 వేల 892 మంది స్వయం సహాయక మహిళా సభ్యుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 5 కోట్ల 51 లక్షల నాల్గవ విడత నగదు చెక్కును మహిళా సంఘాల్లోని సభ్యులకు అందజేశారు. తదుపరి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర్నేడి రత్నగిరి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, బీసీ నాయకులు స్వర్ణాల వెంకట్రావు యాదవ్, వైస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, కావూరి మాబుసుభానయ్య, మాజీ ఎంపీపీ గుత్తా కోటేశ్వరరావు, తెలంప్రోలు రాఘవేంద్రరావు, ఆలపాటి శివ, ముంద్రు రాఘవరావు, పొత్తూరి పూర్ణచంద్రరావు, ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి, స్త్రీనిధి ఏజీయం రంతు చినబుల్లెయ్య, ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, బేబిరాణి, ఖాజావలీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంజినబోయిన నారాయణమ్మ, వీవోఏలు మహిళలు పాల్గొనగా 3 వేల మందికి భోజన వసతి కల్పించినట్లు సర్పంచ్ బీర్నేడి రత్నగిరి తెలిపారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

శావల్యాపురం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పేద ప్రజలకు సేవా సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలో మండలస్థాయిలో వలంటీర్లకు అభినందన సభ సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సేవలందించే వారే వలంటీర్లు అని, మీరు ఇస్తున్న సేవలు ఎనలేనివని ప్రతి ఒక్కరిని మీకుటుంబ సభ్యులుగా భావించి వారి బాగోగులు చూస్తున్న మీ సేవలకు వందనం అన్నారు. శావల్యాపురం మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 202 మంది వలంటీర్లకు గాను, ఇద్దరు సేవా వజ్రాలు,సేవా రత్నలు ఐదు మంది,సేవా మిత్రలుగా 195 మందికి గౌరవ వేతనాలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సేవా వజ్రాలుగా మండలంలోని పొట్లూరు గ్రామసచివాలయ పరిధిలో పొట్లూరి సుకన్య, కారుమంచి గ్రామసచివాలయ పరిధిలో ఏలికా నాగేశ్వరరావులు ఎంపిక కాగా వీరికి ఒక్కొక్కరికీ రూ.45 వేలు, సేవారత్నల్లో భాగంగా మండలంలోని వేల్పూరు-2 గ్రామసచివాలయ పరిధిలో చాపల బ్రహ్మయ్య, పొట్లూరు గ్రామసచివాలయ పరిధిలో దివ్యకోలు రజని, గుంటుపాలెం గ్రామసచివాలయ పరిధిలో మంగమూరి ప్రమీల, కనమర్లపూడి గ్రామసచివాలయ పరిధిలో దేవరపల్లి శ్రీనివాసరావు, కారుమంచి గ్రామ సచివాలయ పరిధిలో గొడుగులూరి సుజాత ఎంపిక కాగా ఒక్కొక్కరికీ రూ.30 వేలు నగదు, మిగిలిన 195 మందికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో నగదును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బీర్నేడి రత్నగిరి, మొనపాటి శ్రీనివాసరావు, తిరివిధి రమణారావు, పురేటి నాగేశ్వరరావు, చింతా విజయ్‌కుమార్, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, గ్రామపార్టీ అధ్యక్షులు తూమాటి కబ్బారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు స్వర్ణాల వెంకటరావు యాదవ్, ముంద్రు రాఘవ రావు, గట్టుపల్లి వీరాస్వామి, ఆలపాటి శివ, సాదినేని వెంకయ్య, ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట: తహసీల్దార్ కార్యాలయంలోని ఇండోర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వై.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. ఈ కారణంగా స్టేషన్‌రోడ్డు, బ్యాంకు స్ట్రీటు, పాత చెక్‌పోస్టు, రామిరెడ్డిపేట అన్నపూర్ణమ్మ హాస్పిటల్ రోడ్డు, వరవకట్ట, శ్రీరాంపురం ప్రాంతాలకు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

నేడు సాహిత్య మేళా

నరసరావుపేట ఈస్ట్: తెలుగు భాషా సాహిత్యాలపై ప్రతినెలా నిర్వహిస్తున్న సాహిత్య మేళ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 4 గంటలకు పల్నాడు కళా క్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సాహిత్యమేళాలో తెలుగు సాహిత్యంలో రామాయణం, కవులు-వారి నవ్యత అనే అంశంపై సాహితీవేత్తలు డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, డాక్టర్ వి.ఎస్.ఎస్.అయ్యంగార్, పీవీఎస్ఆర్ ప్రసాదరావు ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే ఉత్తమ పాఠ్యపుస్తక రచయిత అవార్డు గ్రహీత కుందా భాస్కరరావు రచించిన నూరు వరహాలు పుస్తకావిష్కరణ జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి కారుమంచిలో ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో నూతనంగా వేంచేసియున్న శ్రీసీతారామ స్వామి దేవాలయం పునః ప్రతిష్టా మహోత్స వేడుకలు శనివారం నుంచి ఆరంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సహకారంతో రాతి కట్టుబడితో నూతనంగా నిర్మించిన దేవాలయ ప్రతిష్టా వేడుకలు చివరిరోజు 29న ఉదయం 11.26 నిమిషాలకు ఘనంగా జరుగుతాయన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి విరాళం

చిలకలూరిపేట: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం మార్చి రెండో తేదీన నిర్వహించనున్నారు. వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను దేవాలయ కమిటీ సభ్యులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడుకు శుక్రవారం అందజేశారు. ఆలయ వార్షికోత్సవానికి రూ. 20వేలు విరాళాన్ని భక్త బృందానికి అందజేశారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

వార్డు పర్యటనలో సచివాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి


సచివాలయంలో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 29,30 వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ఉద్యోగులు సక్రమంగా హాజరుకావట్లేదని వచ్చిన ఫిర్యాదును పురస్కరించుకుని సచివాలయాన్ని సందర్శించారు. హాజరుపట్టికను పరిశీలించారు. కొందరు గైర్హాజరు కావడాన్ని గమనించి అడ్మిన్‌ను ప్రశ్నించారు. ఆ సమయంలో ఉన్న వారితో బాధ్యతగా విధి నిర్వహణలో పనిచేయాలని వారికి సూచించారు.

మీరు ప్రజాసేవకులనే విషయం మర్చిపోవద్దని గుర్తు చేశారు. అనంతరం పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. 30 వార్డులోని మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటర్ పాఠశాలను సందర్శించి ఒక టీచర్ మాత్రమే ఉండటాన్ని గమనించి మరో టీచర్ ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు ఫోన్ ద్వారా సూచించారు. అక్కడక్కడా డ్రైనేజ్ అస్తవ్యస్తం, రోడ్లపై గుంతలను గమనించి మున్సిపల్ డీఈ, ఏఇలతో మాట్లాడి వాటిని సక్రమంగా చేయాల్సిందిగా సూచించారు. నిర్లక్ష్యాన్ని విడనాడాలని అధికారులకు సూచించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ పార్కును సందర్శించి వ్యాయామానికి ఉపయోగించే పరికరాలు పరిశీలించారు. మరమ్మత్తులకుగురైన పరికరాలను బాగుచేయించాలని సూచించారు. నాయకులు దివ్వెల రామకృష్ణ, బత్తుల విష్ణువర్ధన్, వరవకట్ట బుజ్జి, ఆయా వార్డుల ఇన్‌చార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నరసరావుపేట: నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.21.40 లక్షల విలువైన చెక్కులను 20 మంది లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం ప్రకాషనగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తిభరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న వారు భయపడవద్దని ప్రభుత్వం తరపున ఆర్థిక సహా యం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఎవరైనా బాధితులు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగించుకోండి


రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట గ్రామ సచివాలయ పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 లో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కృష్ణానాయక్, వైద్యులు వి.సాయితేజ ప్రత్యేక వైద్యనిపుణులు కెఎల్ఎన్ రావు, కె.సుధా స్రవంతిలు, కంటి వైద్యులు ఎస్‌కె చాంద్ బాషాలు వైద్యసేవలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 683 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి వైద్య నిపులు వీరిలో 51 మందికి కంటి వైద్య పరీక్షలు, కొందరికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ వీఏ విజయకుమార్ సర్పంచ్ ఒంగోలు సుబ్బారావు, ఎంపీటీసీ వెంకట రమణ, ఆదాం, ముంద్రు వేంకటేశ్వర్లు, గాలం గోవిందరాజులు సందర్శించారు. ప్రభుత్వం ఆరోగ్య సురక్షకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అతి దగ్గరగా ప్రత్యేక వైద్యనిపుణులు వైద్యసేవలు అందుతున్నాయని, ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు, కార్మిక వ్యతిరేక బీజేపీని గద్దె దింపాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్

నరసరావుపేట: రైతు ఉద్యమం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ వైఖరిని దేశ ప్రజలంతా ఖండించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులతో కాల్పులు జరిపించి కాల్చి చంపడం సరికాదని అన్నారు. ఢిల్లీలో రైతు ఉద్యమకారుడు శుబ్ కరణ్‌సింగ్‌పై మోదీ ప్రభుత్వం పాల్పడిన కర్కశ ఉన్మాద దాడిని ఖండిస్తూ శుక్రవారం రైతు, ప్రజా సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య, ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, రామకృష్ణ, గిరిజన సమైక్య రాష్ట్ర నాయకులు కోట నాయక్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

- లారీ యూనియన్ పార్కింగ్‌కు నాలుగు ఎకరాల స్థలం కేటాయింపు
- పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


లారీ యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు ప్రారంభించారు. పట్టణంలోని మార్కాపురం రోడ్డులో పసుపులేరు వద్ద లారీ యూనియన్ సభ్యులకు పార్కింగ్‌కోసం 4 ఎకరాల స్థలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందకు ఆటోనగర్‌కు 10 ఎకరాలల్లో 400 షాపులు నిర్మాణం కోసం కేటాయించామని తెలిపారు. వినుకొండ అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే టీడీపీ మాజీ ఎమ్మెల్యే అడుగడుగునా కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు సురేష్ మహల్ రోడ్డు విస్తరణ పనులు చేపడితే కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని విమర్శించారు. వినుకొండలో ఏ పని ప్రారంభించినా అడ్డుకోవడం పరిపాటిగా మారిందని చెప్పారు. రానున్న రోజుల్లో ఆటోనగర్, షాపుల నిర్మాణంతోపాటు యూనియన్ స్థలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి జయశ్రీ వెంట్రామిరెడ్డి, కౌన్సిలర్ గంటా కాలేషా, సుబానీ, కొచ్చెర్ల సర్పంచ్ కోపెల దేవరాజ అన్నెం వెంకట్రావు, షేక్ హుసేన్‌వలి, బొజ్జల చినబ్రహ్మయ్య, చెన్నా చంద్రశేఖర్‌బాబు,షేక్ మీరావలి లతోపాటు, లారీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని 16,31 వ వవార్డుల్లో పాఠశాల ప్రహరీ నిర్మాణంలోపాటు, సీసీ రోడ్లు, డ్రైయిన్స్ పనులను ప్రారంభించారు. పట్టణ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్ ఖన్నా, వార్డు కౌన్సిలర్లు షకీలాదస్తగిరి, సానాల పుల్లయ్య, గర్రె శ్రీనివాసరావు,ఎమ్ఎస్‌కె బాషాల తోపాటు పిఎస్ ఖాన్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

అల్లూరి వారిపాలెంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

నరసరావుపేట రూరల్: నేటి యువత సంఘసంస్కర్తల స్ఫూర్తిని అందుకోవాలని గాంధీతత్వ ప్రచారకులు ఈదర గోపీచంద్ తెలిపారు. ఎస్ఎస్ఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో అల్లూరివారి పాలెంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పారిశుద్ధ్యం, తడిచెత్త-పొడిచెత్త, అక్షరాస్యత, పుస్తకపఠనం, మద్యపాన దుష్ఫలితాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భవనం నర్సిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సరళాదేవి, పంచాయతీ కార్యదర్శి పొన్నపాటి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి, సంక్షేమంతో ఎన్నికలకు సిద్ధం

- ప్రజాశ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు


కరపత్రం అందజేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: చేసిన అభివృద్ధి, సంక్షేమంతో ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని... మనందరి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని తొమ్మిదోవార్డులో మన ఊరు- మన రాజేష్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలో ఉన్న ఈశాన్య ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మల్లెల రాజేష్‌నాయుడుకు స్థానికులు కనక తప్పెట్లు, తీన్మార్ డోలక్ వాయిద్యాలు, బాణాసంచా మధ్య ఘన స్వాగతం పలికారు. మల్లెల రాజేష్‌నాయుడు ఇంటింటికీ తిరుగుతూ జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క తొమ్మిదో వార్డు పరిధిలో అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వైఎస్సార్ పెన్షన్ కానుక, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం, వాహనమిత్ర వంటి డీబీటీ పథకాల ద్వారా రూ. 10.75 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఇళ్ల స్థలాలు, విద్యాకానుక, జగనన్న తోడు, గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ వంటి నాన్ డీబీటీ పథకాల ద్వారా రూ. 5.51 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఒక్క వార్డులోనే డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా 5,308 మందికి రూ. 16.26 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. దీనికి తోడు నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, వార్డు సచివాలయాల ఏర్పాటు, రోడ్లు, డ్రైన్లు నిర్మాణం ద్వారా ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, వార్డు కౌన్సిలర్ చింతపల్లి విల్సన్‌పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటికి సవాల్....

మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు టిడ్కో గృహాలకు సంబంధించి సెల్ఫీ ఛాలెంజ్ విసరడం పట్ల మల్లెల రాజేష్‌నాయుడు ప్రతిసవాల్ విసిరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన టిడ్కో గృహాల నిర్మాణం సకాలంలో పూర్తి చేయలేకపోవడం ప్రత్తిపాటి అసమర్థతకు, అవినీతికి నిదర్శనమన్నారు. సీసీఐ కుంభకోణంలో వందల కోట్లు అవినీతికి పాల్పడిన పుల్లారావు నీతి నిజాయితీల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వీటితో పాటు మైనింగ్‌లో పాల్పడిన అవినీతిని సైతం నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాలు విసిరారు.

స్వస్థత చేకూరాలి

దేవుని ప్రార్థనలు ప్రజలకు స్వస్థత చేకూర్చాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. రాజాపేటలో తండ్రి సన్నిధి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపవాస, సువార్త మహాకూటములకు మల్లెల రాజేష్ నాయుడు గురువారం రాత్రి హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం, వైఎస్సార్ సీపీ నాయకులు పంగులూరి వెంగళరాయుడు, గొంటు శ్రీనివాసరెడ్డి, బేరింగ్ మౌలాలి, కొచ్చర్ల కిషోర్, మైలా రాజేష్, గోపతోటి జాన్, జయకుమార్ పాల్గొన్నారు.